ప్రజాశక్తి
బుధవారం 27 మార్చి 2024
5
విజయనగరం



లోక్‌సభ అభ్యర్థిత్వానికి ముగ్గురి పేర్లు పరిశీలన

ఐవిఆర్ఎస్ చేపట్టిన టిడిపి అధిష్టానం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

టిడిపి విజయనగరం లోక్‌సభ అభ్యర్థిత్వానికి మాజీ ఎమ్మెల్యే మీసాల గీత, ఎచ్చెర్ల నియోకవర్గానికి చెందిన కలిశెట్టి అప్పలనాయుడు, నెల్లిమర్ల నియోజకవర్గం డెంకాడ మండలానికి చెందిన కంది చంద్రశేఖర్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఈ మేరకు ఈ ముగ్గురి అభ్యర్థిత్వంపై పార్టీ అధిష్టానం మంగళవారం ఐవిఆర్ఎస్ సర్వే చేపట్టింది. మాజీ మంత్రులు పూసపాటి అశోక్ జగపతిరాజు, కిమిడి కళావెంకటరావు పేర్లు తొలి నుంచీ అనుకుంటున్నప్పటికీ వీరిలో ఒకరికి సామాజిక సమీకరణాలు అడ్డువస్తున్నట్టుగా విశ్లేషకులు భావిస్తున్నారు. మరొకరు ఎంపీగా పోటీచేసేందుకు ఆశక్తి చూపడం లేదని సమాచారం.

బొత్సపై భయమెందుకో?

- ఎమ్మెల్యే అభ్యర్థిని తేల్చుకోలేకపోతున్న టిడిపి
- తెలుగు తమ్ముళ్లలో నైరాశ్యం



ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, వైసిపి సీనియర్ నేతపై పోటీకి టిడిపి భయపడుతుందా? అందుకే చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరనేది తేల్చుకోలేకపోతోందా? అంటే చాలా మంది నోట ఔననే సమాధానం వినిపిస్తోంది. కొంతమంది మాత్రం జిల్లాలో బొత్స ప్రభావాన్ని, హవాను కట్టడి చేసేందుకు టిడిపి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోందని చెబుతున్నారు. కానీ, టిడిపి వ్యూహం వైసిపి దాహం తీర్చే విధంగా మారిపోతోంది. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జున దాదాపు పదేళ్లగా స్థానిక టిడిపి కేడర్‌తో మమేకమై పనిచేస్తున్నారు. గడిచిన ఐదేళ్లలో టిడిపిలో మరెవ్వరూ లేనంతగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించారు. లోకేష్ నిర్వహించిన యువగళం సభకు కూడా నాగార్జున నాయకత్వంలో జనం భారీగానే తరలి వచ్చారు.

ఈనేపథ్యంలో చీపురుపల్లి సీటు నాగార్జునకే అన్న చర్చసర్వత్రా సాగింది. అనూహ్యంగా నాగార్జునతోపాటు ఆయన పెదనాన్న, మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు, మాజీ ఎమ్మెల్యే మీసాల గీత అభ్యర్థిత్వంపై ఐవిఆర్ఎస్ సర్వే చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో, నాగార్జున, ఆయన అభిమానులు తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. దీనిపై ఎలాంటి క్లారిటీ ఇవ్వకుండానే మరో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పేరును పరిశీలనలో ఉంచడం చర్చనీయాంశంగా మారింది. ఇంతమంది పేర్లు పరిశీలనలో వున్నప్పటికీ ఎటూ తేల్చలేకపోతోంది. మరోవైపు ఎన్నికల షెడ్యూల్ వెలువడి, పోలింగ్ తేదీ ఖరారు కావడం, మరోవైపు జిల్లా వ్యాప్తంగా అన్ని నియోకజవర్గాల్లోనూ ప్రచారం హోరెత్తుతుండడం, చివరికి చీపురుపల్లిలోనూ వైసిపి తరపు ప్రచారం ఊపందుకోవడంతో ఈ నియోజకవర్గంలో నా అనుకునే నాయకుడు లేక తెలుగు తమ్ముళ్లు నైర్యాశ్యంలోకి వెళ్లారు. ఇప్పటికీ నాగార్జున నియోజకవర్గంలో సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ అభ్యర్థిత్వం ఖారారు కాక అభిమానులు అయోమయంలో ఉన్నారు. కేడర్‌లో పట్టుదల సడలుతోందని మండల, నియోజకవర్గ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా కొద్ది రోజులుగా బొత్స తన ప్రచార పర్వానికి పదును పెట్టారు. నియోజకవర్గంలో దాదాపు అన్ని గ్రామాల్లోనూ ఒక దఫా ప్రచారాన్ని పూర్తిచేశారు.

వాస్తవానికి చీపురుపల్లి రాజకీయ ముఖచిత్రాన్ని ఒక్కసారి పరిశీలిస్తే నేటి వైసిపి, నాటి కాంగ్రెస్ కన్నా టిడిపి అభ్యర్థులే ఎక్కువసార్లు గెలుపొందారు. గత ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి కిమిడి నాగార్జునపై వైసిపి తరపున పోటీ చేసిన బొత్స సత్యనారాయణ విజయం సాధించినప్పటికీ, అంతకు ముందు 2014లో నాగార్జున తల్లి మృణాళినిపై పోటీచేసి ఓటమి చెందారు. ఈ మాటకొస్తే మృణాళిని ఈ నియోజకవర్గంలో కూడా లేరు. అంతకు ముందు 2004, 2009 ఎన్నికల్లో వరుసాగా రెండుసార్లు టిడిపి అభ్యర్థి గద్దె బాబూరావుపై బొత్స విజయం సాధించినప్పటికీ, 1983లో టిడిపి ఆవిర్భావం నుంచి వరుసగా ఐదు సార్లు టిడిపియే విజయం సాధించింది. ఈ విధంగా పరిశీలించినప్పుడు టిడిపి ఆవిర్భావం తరువాత జరిగిన 9 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ఒకసారి వైసిపి, రెండు సార్లు కాంగ్రెస్ గెలిచాయి. మిగిలిన ఆరుఎన్నికల్లో టిడిపి హవా కొనసాగింది. పోనీ, ఇక్కడ బొత్సకి ఓటమి లేదా అంటే ఒకసారి నాగార్జున తల్లే ఓడించారు. ఇలా టిడిపికి కంచుకోటలా ఉన్న చీపురుపల్లిలో నేడు అభ్యర్థిని ఖరారు చేసేందుకు సాహశించ లేకపోవడంతో నియోకవర్గంలోని టిడిపి అభిమానులను కలవరపాటుకు గురిచేస్తోందని సాక్షాత్తు ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు. ఇంకా వ్యూహం పేరుతో అభ్యర్థి ప్రకటన తేల్చకపోతే పనిగట్టుకుని వైసిపికి అప్పగించినట్టేనంటూ పలువురు విశ్లేసిస్తున్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గజపతినగరం ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఫిజికల్ సైన్సు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కేతిరెడ్డి వెంకటరమణ మంగళవారం గుండెపోటుతో తన నివాసంలో మృతి చెందారు. విజయనగరం లోని ఉడా కాలనీ ఫేజ్ 1లో నివాసముంటున్న ఆయన టెన్త్ పరీక్షల నేపథ్యంలో స్పాట్ కేంద్రం ప్రభుత్వ బాలికల హైస్కూలులో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం విధులకు బయలుదేరుతుండగా ఒక్కసారిగా గుండెపోటు వచ్చింది. వెంటనే కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేసి ప్రభుత్వ సర్వ జన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినలు తెలిపారు. వెంకటరమణకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమార్తె దుర్గాపూన్ నిట్‌లో ఇంజినీరింగ్ చదువుతుండగా, రెండో కుమార్తె విశాఖలో ఇంటర్ చదువుతోంది. ఆయన భార్య ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు.



సచివాలయ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని సుందరాడ గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్న ఉప్పాడ శ్రీకాంత్ (25) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. విధులకు హాజరైన ఆయన మధ్యాహ్నం భోజనం చేసేందుకు ద్విచక్ర వాహనంపై స్వగ్రామం ఉద్దవోలు వెళ్తుండగా, మార్గమధ్యలో గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. వెంటనే స్థానికులు రాజాం కేర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రీకాంత్‌కు ఇంకా వివాహం కాలేదు. కుమారుడు మృతితో కుటుంబ సభ్యులు, తోటి ఉద్యోగులు కన్నీరుపెట్టారు.



కార్పొరేషన్ కార్యాలయం వద్ద బైఠాయించిన పంపు హౌస్ కార్మికులు

బకాయి జీతాలు వెంటనే చెల్లించాలి

విఎంసి వద్ద పంప్ హౌస్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం కార్పొరేషన్ ప్రజానీకానికి తాగునీరు అందిస్తున్న ముషిడిపల్లి , రామతీర్థం నెల్లిమర్ల మాస్టర్ పంపుహౌస్ కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) నాయకులు జగన్మోహన్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 16న కమిషనర్ సమక్షంలో జరిగిన చర్చల్లో ఈనెల 18 మధ్యాహ్నం నాటికి రూ.2వేలు బకాయి జీతంతో పాటు అమృత పంపు హౌస్ కార్మికులకు సెప్టెంబర్ బకాయి జీతం చెల్లిస్తామని కాంట్రాక్టర్ హామీ ఇచ్చారని, కానీ నేటికీ డబ్బులు చెల్లించలేదని అన్నారు. అమృత పంప్ హౌస్ కార్మికులకు 2022 మార్చి, ఏప్రిల్ జీతం బిల్లులు కూడా పెట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోజు ధర్నా చేస్తామని చెప్పేసరికి 70 మందికి రూ.2వేలు చొప్పున అకౌంట్‌లో వేశారని తెలిపారు. 2023 జూలై నుంచి ప్రభుత్వం వద్ద బిల్లులు పెండింగ్లో ఉన్నాయని, అవి వస్తే తప్ప జీతాలు చెల్లించలేమని కాంట్రాక్టర్ చేతులెత్తేస్తున్నారని తెలిపారు. 7 నెలలు గా జీతాలు లేక కుటుంబాలతో ఇబ్బంది పడుతున్నామని, ప్రభుత్వం, పాలకవర్గం ఇప్పటికైనా స్పందించి బకాయి జీతాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరవధిక నిరసన దీక్షలకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం బకాయి జీతాలపై కమిషనర్ ఎంఎం నాయుడుతో చర్చించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి జీతాలు ఇప్పించేందుకు ప్రయత్నిస్తానని చెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో నెల్లిమర్ల, ముషిడిపల్లి, రామతీర్థం పంపుహౌస్ కార్మికులు పాల్గొన్నారు.

శిలాఫలకాలకు కోడ్ వర్తించదు

విజయనగరం : ఎన్నికల కోడ్ అమలులోనికి రాక ముందు లబ్ధిదారుల వద్ద నున్న పాస్ పుస్తకాల పైన లేదా ఏ ఇతర లబ్ధిదారు కార్డుల పైన ఉన్న ప్రభుత్వ లోగోలు, ముఖ్యమంత్రి ఫోటోలు ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు రావని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి స్పష్టం చేశారు. అదే విధంగా కోడ్ రాక ముందు వేసిన శిలా ఫలకాలు, సర్వే రాళ్లకు కూడా కోడ్ వర్తించదని తెలిపారు. మోడల్ కోడ్ అమలు అధికారులు కోడ్ లోని అంశాలను క్షున్నంగా చదవాలని తెలిపారు.

శ్రీనుబాబుకు ఎంపి టిక్కెట్ ఇవ్వాలి

విజయనగరం టౌన్ : ప్రజా సేవకుడు గేదెల శ్రీనుబాబుకు ఎంపి టిక్కెట్‌ను కేటాయించాలని తూర్పు కాపు సామాజిక వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు మజ్జి అప్పారావు, జిల్లా అధ్యక్షులు రొంగలి రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం తూర్పు కాపు సామాజిక వేదిక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులకు అండగా ఉండి, పంటలు మెరుగుదలకు అనేక ప్రణాళికలు వెసి,రైతులకు అవగాహన కల్పించడం కోసం పని చేస్తున్న గేదెల శ్రీనుబాబుకు టిక్కెట్ కేటాయించాలని కోరారు.

ఇవిఎంల భద్రతను సమీక్షించిన కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్

స్థానిక ఇవిఎం గోదాములను కలెక్టర్ నాగలక్ష్మి మంగళవారం తనిఖీ చేశారు. అక్కడి భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. గోదాములను తెరిపించి, నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన గదులను, ఇవిఎంలను పరిశీలించారు. అనంతరం మళ్లీ గోదాములకు సీళ్లు వేయించారు. గోదాముల్లోని సిసి కెమేరాలను తనిఖీ చేశారు. ఇవిఎంల తొలిదశ తనిఖీకి ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, ఎన్నికల విభాగం సూపరింటిండెంట్ ప్రభాకర్, నెల్లిమర్ల తాహశీల్దార్ రామరాజు, మున్సిపల్ కమిషనర్ బాలాజీ ప్రసాద్, రాజకీయ పార్టీల ప్రతినిధులు సముద్రాల రామారావు, కుటుంబరావు, గేదెల రాజారావు, తాలాడ సన్నిబాబు, పద్మనాభం, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఇవిఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ , జెసి



పనులను అడ్డుకుంటున్న రామచంద్రపేట యువకులు

రెండో రోజు క్వారీ పనులు అడ్డగింత

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని రామచంద్ర పేట క్వారీ వద్ద జరుగుతున్న పనులను రెండో రోజు కూడా గ్రామస్తులు అడ్డుకున్నారు. క్వారీలో ఉన్న మెటీరియల్‌ను బయటికి వెళ్ళనివ్వలేదు. లోడింగ్‌తో ఉన్న లారీల్లో నుంచి సామగ్రిని కూడా కిందకి దింపించి వేశారు. గ్రామానికి ఆనుకుని ఉన్న క్వారీలో బాంబు పేలుళ్లకి గ్రామస్తులంతా చాలా ఇబ్బందులుపడుతున్నామని గ్రామస్తులంతా కలిసి వెళ్లి క్వారీ పనులను సోమవారం అడ్డుకొని నిరసన తెలియజేసిన విషయం తెలిసిందే. బాంబు పేలుళ్లకు సంబంధించిన డ్రిల్లింగ్ పనులను మంగళవారం క్వారీలోని కార్మికులు యధావిధిగా చేపట్టారు. దీంతో మళ్ళీ గ్రామస్తులంతా క్వారీ వద్దకు వెళ్లి యాజమాన్యం వచ్చేవరకు పనులు చేపట్టొద్దని అక్కడ ఉన్న సిబ్బందికి తెలియజేశారు. నిత్యం సుమారు 200 అడుగుల లోతులో పేలుళ నిర్వహిస్తుండడంతో గ్రామస్తులం దరం చాలా ఇబ్బంది పడుతున్నామని అక్కడ ఉన్న సిబ్బందికి తెలిపారు. యాజమాన్యం వచ్చే గ్రామస్తులతో చర్చలు జరిపిన తర్వాతే పనులను చేపట్టాలని, లోపల ఉన్న మెటీరియల్ ను తరలించాలని అన్నారు. అంతవరకు గ్రామస్తులు పనులు అడ్డుకుంటామని హెచ్చరించారు.

సుశీలకు పరిపూర్ణ జీవిత సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి - విజయనగరం కోట




గాన కోకిల పద్మభూషణ్ డాక్టర్ పి.సుశీలకు పరిపూర్ణ జీవిత సాఫల్య పురస్కార ప్రదానం చేయనున్నట్లు శ్రీగురు నారాయణ కళా పీఠం అధ్యక్షులు డాక్టర్ జి సన్యాసమ్మ, వ్యవస్థాపక అధ్యక్షులు బిఎ నారాయణ తెలిపారు. మంగళవారం పట్టణం లోని ఒక హోటల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో తృతీయ వార్షికోత్సవ వేడుకల కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ గురు నారాయణ కళాపీఠం తృతీయ వార్షికోత్సవం ఏప్రిల్ 1వ తేదీన ఆనంద గజపతి ఆడిటోరియ ంలో నిర్వహిస్తామన్నారు. విజయనగరం ఆడపడుచు గాన కోకిల పి.సుశీలమ్మ కు వయోభారమైనప్పటికీ మన విజయనగరం పై మక్కువతో ఈ పురస్కార స్వీకరణకు ఆమె అంగీకరించారన్నారు. ప్రఖ్యాత సినీ సంగీత దర్శకులు మణిశర్మ, నాటి లవకుశలో నటించిన మాస్టర్ సుబ్రహ్మణ్యం 76 ఏళ్ల వయసులో ఇప్పుడు రావడానికి ఒప్పుకోవడం సంతోషంగా ఉందన్నారు. సాయంత్రం 6 గంటలకు మణిశర్మ సారధ్యంలో సంగీత విభావరి నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సమావేశంలో హోటల్ అధినేత బాబురావు, కోశాధికారి బి. పద్మావతి, గాయకులు పవన్, చరణ్, వైవివి సత్యనారాయణ పాల్గొన్నారు.

చిరు వ్యాపారికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కష్టంలో ఉన్నవారిని అక్కున చేర్చుకుని చేతనైనంత సాయం చేయడమే జిల్లా ఆర్యవైశ్య మిత్రుల గ్రూప్ లక్ష్యమని ఆ గ్రూప్ అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్ అన్నారు. మంగళవారం శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద జరిగిన సమావేశంలో శేఖర్ మాట్లాడుతూ జామి మండలం రామభద్రపురంలో చిరు వ్యాపారం చేస్తూ జీవిస్తున్న తెలగంశెట్టి సత్యనారాయణ దంపతులు ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడ్డారని తెలిపారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని గ్రూప్ సభ్యుల సహకారంతో వైద్యం కోసం రూ,1 లక్షా 20 వేలు అందించినట్లు తెలిపారు. జిల్లా ఆర్యవైశ్య మిత్రులు రూ45వేలు, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ రూ75 వేలు సాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మిత్రుల గ్రూప్ కార్యదర్శి డిమ్స్ రాజు, సముద్రాల నాగరాజు, వాసవీక్లబ్ జిల్లా గవర్నర్ ఆత్మకూరి సాంబమూర్తి, గుంపిన నారాయణరావు బిపిఎస్ రామయ్య కుమ్మరిగుంట శ్రీనివాసరావు తీగెల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ఓటర్లతో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్

ఓటు వేయడం మన బాధ్యత

అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్

ప్రజాశక్తి- విజయనగరం

ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యతని అసిస్టెంట్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా హిజ్రాలకు మంగళవారం ఓటుపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ మన పాలకులను మనమే ఎంచుకొనే గొప్ప అవకాశాన్ని ఎన్నికలు కల్పిస్తాయని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుమారు 97 కోట్లమంది ఓటర్లు ఉన్న దేశంలో ఎన్నికలు గొప్ప ప్రజాస్వామ్య క్రతువుగా పేర్కొన్నారు. భారత పౌరులంతా తప్పనిసరిగా ఓటుహక్కును వినియోగించుకోవాలని, ఒక్క ఓటు కూడా వృధా కాకూడదని కోరారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో వివిధ సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. ఫిర్యాదులు, వినతుల కోసం వివిధ రకాల యాప్‌లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

ఫిర్యాదు ఇచ్చిన 100 నిమిషాల్లోనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ జగదీష్, మున్సిపల్ సహాయ కమిషనర్ తిరుమలరావు, స్వీప్ జిల్లా నోడల్ అధికారి పి.శ్రీనివాసరావు, స్వీప్ రిసోర్సు పర్సన్ పద్మనాభం, హెల్పింగ్ హేండ్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొండబాబు తదితరులు మాట్లాడారు. అనంతరం ఓటర్లతో ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామంటూ పతిజ్ఞ చేయించారు.

వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



కోలగట్లకు నోట్ల దండ వేస్తున్న కార్యకర్త

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాహిత పాలనకు కీలకంగా ఉన్న వాలంటీర్లపై ప్రతిపక్ష నేతలు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు సరికాదనిడిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. మంగళవారం 6, 7 డివిజన్ పరిధిలలో జరిగిన ఇంటింటి ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఇంటింటికీ వెళ్తుంటే ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన స్వయంగా ఇంటికీ వెళ్లి పింఛన్లను అందజేయడంతో వృద్ధులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. అందుకే వాలంటీర్లపై గంటకో మాటను మాట్లాడుతున్నారని అన్నారు. వాలంటీర్ వ్యవస్థను దెబ్బతీయాలని ఎన్నో కుయుక్తులు పన్నారని అన్నారు. వాలంటీర్లను ఎన్నికల అనంతరం తొలగించబోమని బయటకు ప్రకటిస్తున్నప్పటికీ లోలోపల అంతర్మధనం చెందుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయ యాదవ్, రాష్ట్ర పరిశ్రమల అభివద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, జోనల్ ఇన్చార్జిలు బొద్దాన అప్పారావు, బోడ సింగి ఈశ్వరరావు, రెడ్డి గురుమూర్తి, స్థానిక కార్పొరేటర్లు పొంతపల్లి మాలతి, ఆల్తి సత్యకుమారి, గాదం మురళి, మాజీ కౌన్సిలర్ కోరాడ సూరి ప్రభావతి, గదుల సత్యలత తదితరులు పాల్గొన్నారు.

సిఏఏను రద్దు చేయాలి

- మత ప్రాతిపదికన పౌరసత్వం రాజ్యాంగ వ్యతిరేకం
- సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి
- వామపక్ష, లౌకిక పార్టీల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ




కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష, లౌకిక పార్టీల నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

దేశాన్ని బలహీనపరిచే సిఏఏ చట్టం అమలును రద్దు చేయాలని, బిజెపి మోడీ విధానాలకు మద్దతు తెలిపే వైసిపి, టిడిపి జనసేన పార్టీలను వ్యతిరేకించాలని సిపిఎం సీనియర్ నాయకులు ఎం. కృష్ణమూర్తి అన్నారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన సిఏఏ మతోన్మాదపు చట్టాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం స్థానిక చర్చి జంక్షన్ నుండి కాంప్లెక్స్ మెయిన్ రోడ్డు మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ, సిపిఐ న్యూ డెమోక్రసీ, కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. నాటి బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ముందు మోకరిల్లి క్షమా భిక్షకు మొరపెట్టుకున్న బిజెపి దేశభక్తులు నేడు దేశభక్తి కోసం మాట్లాడుతుండడం సిగ్గుమాలిన చర్యని విమర్శించారు. పౌరసత్వ చట్టం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైనదని, ఈ చట్టం దేశంలోని ముస్లింల సమస్య కాదని, పౌరులందరి సమస్య అని తెలిపారు. ఇది దేశ ఐక్యతకు, లౌకిక, ప్రజాస్వామ్యానికి ముంచుకొస్తున్న ప్రమాదానికి పేర్కొన్నారు. అన్ని మతాలు, జాతులు కలిసి పోరాడి స్వాతంత్ర్యం సాధించుకున్నాయని, ఆర్ఎస్ఎస్, బిజెపి కలిసి దేశ లౌకిక స్వభావాన్ని నాశనం చేసి నిరంకుశ హిందూ మత రాజ్యంగా మార్చడానికి చేస్తున్న ప్రయత్నంలో భాగమేనని అన్నారు. ఇంత దుష్ట పన్నాగం పన్ని దేశ రాజ్యాంగాన్ని బలహీనపరిచే సిఏఏ చట్టం అమలును అడ్డుకోవాల్సిన వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు రాష్ట్రంలో బిజెపి వద్ద మోకరిల్లాయని అన్నారు. ఇది రాష్ట్ర దౌర్భాగ్య పరిస్థితి అని మండిపడ్డారు. మత ప్రాతిపదికన పౌరసత్వం అంటే ప్రపంచవ్యాప్తంగా, అమెరికాలో ఉన్న మన దేశపౌరులకు ప్రమాదం వస్తుందని నాయకులు తెలిపారు. అందుకు ఈ చట్టాన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత దేశ పౌరులైన మన అందరి పైనా ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిపిఐ జిల్లా కార్యదర్శి కోరంగి మన్మధరావు, దుర్గరావు, కుమార్, కాంగ్రెస్ నాయకులు ఎం.సింహాచలం, సిపిఐ న్యూ డెమోక్రసి నాయకులు నర్సింగరావు, రమణి, సిపిఐ లిబరేషన్ నాయకులు పి. సంఘం, సిపిఎం నాయకులు వై.మన్మధరావు, వి. ఇందిరా, జి.వెంకటరమణ, రెడ్డి ఈశ్వరరావు, రెడ్డి లక్ష్మునాయుడు, బి.సూరిబాబు, గవర వెంకటరమణ, పి.రాజశేఖర్, డి.పండు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎం.కృష్ణమూర్తి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు

ప్రజాశక్తి - రేగిడి

ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు తప్పవని ఎస్ఐ ఈ. శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం అంబాడ వెంకటాపురం గ్రామంలో ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామంలో గస్తీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మద్యంకు పాల్పడితే తక్షణమే సమాచారం అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. ఎస్ఐతో పాటు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - విజయనగరం కోట

అర్చకులపై దాడి చేసిన వైసిపి నాయకులపై చర్యలు తీసుకోవాలని విజయనగరం మాజీ ఎమ్మెల్యే మీసాల గీత కోరారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కానాడ శివాలయంలో పనిచేసే అర్చకులు సాయి శర్మ, విజయ్ కుమార్ శర్మల పై సోమవారం గుర్గుడి వద్ద జరిగిన భౌతిక దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అర్చకులను కాళ్లతో తన్ని భౌతిక దాడి చేసిన వైసిపి మాజీ కార్పొరేటర్ పై కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

విజయవంతంగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - చీపురుపల్లి


రక్తదానం చేస్తున్న యువత

సినీ నటుడు రాంచరణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. కళింగ వైశ్య యువత ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారు 30 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ జెడిసి బెల్లాన వంశీకృష్ణ, కళింగ వైశ్య ప్రతినిధులు ఎస్‌విజి శ్రీనివాసరావు, కింతలి మధు, గరివిడికి చెందిన రాంచరణ్ అభిమానులు రమణ, స్వామినాయుడులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - రేగిడి

మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ పరిధి అక్కన్న గహరం(?) గ్రామానికి చెందిన బెల్ట్ షాపు నడుపుతున్న వ్యక్తి 18 మద్యం బాటిల్‌తో పోలీసులకు మంగళవారం పట్టుబడ్డాడు. ఉంగరాడ మెట్ట నుంచి స్వగ్రామానికి అక్రమంగా మద్యం బాటిళ్లు తీసుకువెళ్లడంతో ఉంగరాడ మెట్ట జంక్షన్ వద్ద పోలీసులు దాడులు జరిపారు. అక్రమ మద్యందారున్ని రేగిడి పోలీస్ స్టేషన్ తీసుకువచ్చారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.


ఎంపిడిఒ ఈశ్వరమ్మకు వినతి పత్రాన్నిస్తున్న సర్పంచ్ వెంకటనాయుడు

మస్తర్లలో అవకతవకలను అరికట్టాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలో ఉపాధిహామీ పథకంలో మస్తర్ల అమలలో పలు అవకతవకలు జరుగుతున్నాయని టిడిపి నాయకులు, నర్సాపురం సర్పంచ్ కోట వెంకటనాయుడు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఎంపిడిఒ ఈశ్వరమ్మకు వినతిపత్రం ఇచ్చారు. వందరోజులు పని పూర్తయినప్పటికీ కొంతమందికి మేట్ మస్తర్లు వేస్తున్నారని తెలిపారు. పని ప్రదేశానికి ఫీల్డ్ అసిస్టెంట్ రాకపోవడంతో అధికార పార్టీకి చెందిన మేట్ ఎన్నో అవకతవకలకు పాల్పడుతోందన్నారు. దీనిపై ఎంపిడిఒ ఈశ్వరమ్మ మాట్లాడుతూ ఎపిఒను గ్రామంలోకి పంపించి పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తానని హామీ ఇచ్చారు.

జీర్ణ వ్యవస్థలో పెద్ద పేగు కీలకం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జీర్ణ వ్యవస్థలో పెద్ద పేగు కీలకమైందని సెంచూరియన్ విశ్వ విద్యాలయం పూర్వ విద్యార్థి పింగళి మేఘన అన్నారు. మంగళవారం వర్చువల్ విధానంలో ఆమె కలనోల్ స్కోపీ మీద ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇది ఆహారంలోని నీటిని, పొటాషియమ్ వంటి లవణాలను, కొవ్వులో కరిగే విటమిన్లను గ్రహించి శరీరానికి అందించడమే కాక శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపటంలోనూ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పెద్ద ప్రేగును వైద్యపరిభాషలో కోలాన్ అని అంటారన్నారు. సాధారణ నీళ్ల విరోచనాలు మొదలుకొని ప్రమాదకర కేన్సర్ల వరకూ ఎన్నో సమస్యలు పెద్ద పేగులో కనిపిస్తాయన్నారు. ప్రధానంగా కోలనోస్కోపీ ప్రక్రియను కొలొరెక్టల్ కేన్సర్, పాలిప్స్ (గడ్డలు), ఇతర జీర్ణశయాంతర సమస్యల వంటి స్క్రీనింగ్, రోగనిర్ధారణ పరిస్థితులను తెలుసుకోవడం కోసం ఉపయోగిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, విభాగాధిపతి నూకరాజు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షకు 25287 మంది హాజరు

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

పదో తరగతి పబ్లిక్ పరీక్షకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా 26,103 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా వారిలో 25,287 మంది హాజరు కాగా, 816మంది గైర్హాజరు అయ్యారు. జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా పరీక్ష జరిగిందని, 52 కేంద్రాలను తనిఖీ బృందాలు పరిశీలించాయని జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు.

గిరిజన గ్రామాల్లో ఎంసిసి పర్యటన

వీరఘట్టం: మండలంలోని గదభవలస పంచాయతీ పరిధిలోని నీలంపేట, శాంతిగూడ, ఏలీషాపురం తదితర గిరిజన గ్రామాల్లో ఎంపిడిఒ, ఎంసిసి అధికారి ఎంవిబి సుబ్రహ్మణ్యం మంగళవారం పర్యటించారు. గ్రామాల్లో ఎక్కడైనా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన స్టిక్కర్లు, బ్యానర్లు ఉన్నదీ, లేనిదీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయనతో పాటు ఎంసిసి బృందం ఉంది.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలుండాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

పోలింగ్ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇఆర్ఒ, ఆర్‌డిఒ సాయిశ్రీ ఆదేశించారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ సులోచనారాణితో కలిసి కొట్టక్కి, తారాపురం స్కూల్స్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్లు నిర్భయంగా స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకొనేందుకు అవగాహన కల్పించాలని, ఆహ్లాదకర వాతావరణంలో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎండాకాలం వేడి తీవ్రత ఎక్కువగా ఉండే సమయంలో ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా ఓటర్లకు నీడ కల్పించే దిశగా ఏర్పాట్లు చేయాలని చల్లని నీరు, వైద్య సిబ్బంది పోలింగ్ ప్రదేశంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది, బిఎల్ఒలు ఉన్నారు.


రామభద్రపురం: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇఆర్ఒ సాయిశ్రీ


నెల్లిమర్ల: రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న ఇఆర్ఒ నూకరాజు

ప్రశాంత ఎన్నికలకు పార్టీలు సహకరించాలి

నెల్లిమర్ల: ప్రశాంత ఎన్నికలకు అన్ని పార్టీలూ సహకరించాలని ఇఆర్ఒ ఎం. నూకరాజు కోరారు. మంగళవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలతో ఇఆర్ఒ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి ఎం. నూకరాజు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ విడుదల చేసిన నిబంధనలు తూ.చ తప్పకుండా పాటించాలని, కోడ్ ఉల్లంఘన జరిగితే చర్యల తీసుకుంటామని చెప్పారు. అనుమతి లేకుండా ప్రచార కార్యక్రమాలు, ఊరేగింపులు చేయరాదన్నారు. కాగా రాజకీయ పార్టీలపై ఎలక్షన్ కమిషన్ నిఘా పెట్టింది కాబట్టి ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కగా అమలు జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎఆర్ఒ డి. ధర్మ రాజు, వైసిపి, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అమలకు సహకరించాలి

బొబ్బిలి: ఎన్నికల నియమావళి అమలకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. సాయిశ్రీ కోరారు. తన కార్యాలయంలో మంగళవారం ఎన్నికల నియమావళిపై రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నియమావళికి లోబడి ప్రచారం, సభలు, ర్యాలీలు చేయాలన్నారు. అనుమతులు లేకుండా ఇంటింటి ప్రచారం, ర్యాలీలు, సభలు నిర్వహిస్తే కేసులు పెడతామన్నారు. సమావేశంలో టిడిపి, వైసిపి పార్టీల ప్రతినిధులు వి.సత్యనారాయణ, మజ్జి జగన్నాధం, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు అవగాహన

కొత్తవలస: మండలంలోని 206 పోలింగ్ స్టేషన్ పరిధిలో విజ్ఞాన భారతి స్కూల్ ప్రాంగణం వద్ద స్వీప్ నోడల్ అధికారి పి. సునీత మంగళవారం ఓటర్లకు అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కలిగి ఉండాలన్నారు. ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ కచ్చితంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.


కొత్తవలస: ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న నోడల్ అధికారి సునీత

వాలంటీర్లంటే బాబుకు భయమెందుకు?

ఎమ్మెల్యేలు అప్పలనర్సయ్య, కడుబండి

ప్రజాశక్తి- గజపతినగరం

వాలంటీర్లు అంటే టిడిపి అధినేత చంద్రబాబు ఎందుకంత భయపడుతున్నారని స్థానిక ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య ప్రశ్నించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాలంటీర్ల విషయంలో చంద్రబాబు రెండు నాలుకల ధోరణి అవలంబిస్తున్నారని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే వాలంటీర్లు తొలగిస్తామని ఒకసారి, మరోసారి తొలగించమని, అంతలోనే మంచి జీతాలు ఇస్తామని అంటూ రోజుకో మాట చంద్రబాబు నోట వినిపిస్తుందని హేళన చేశారు. వాలంటీర్ల ఓట్లను కోల్పోతామేమో నన్న భయంతో చంద్రబాబు ఈ విధంగా మాట్లాడుతున్నారని దుయ్య బట్టారు. నిరంతరం ప్రజలకు సేవలు అందించే వాలంటీర్లు జోలికి వస్తే ప్రజా విశ్వాసాన్ని కోల్పోతామని చంద్రబాబు గ్రహించి తన రూటు మార్చారన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలులో వాలంటీర్లు ఎంతో నిబద్ధతతో పని చేశారన్నారు. ఈ సమావేశంలో వైసిపి మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, సర్పంచ్ బెల్లాన త్రినాధ, ఉప సర్పంచులు మండల సురేష్, కర్రీ రామ్ నాయుడు, జెసిఎస్ కన్వీనర్, కనకల సుబ్రహ్మణ్యం, కర్రీ నానాజీ, ఆల్తి గణపతి, మండల లక్ష్మనాయుడు, గొర్ల సత్యం, అప్పలనాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనర్సయ్య

కొత్తవలస: సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో కీలకంగా ఉన్న వాలంటీర్లపై ప్రతిపక్ష నేతలు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు హేయమైన చర్య అని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సాయంత్రం గొల్లపేట, కాటకాపల్లి, చినరావుపల్లి గ్రామాల్లో ఇంటింటి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల ముంగిటికే తీసుకుని వెళుతున్న వాలంటీర్ వ్యవస్థ అద్భుతమైన పనితీరును కనపరచడంతో ప్రతిపక్షంలో గుబులు రేగుతోందన్నారు. అందుకే వాలంటీర్లపై గంటకో మాటను మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, వైసిపి మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, కాటకాపల్లి సర్పంచ్ పీతల కృష్ణ, చినరావుపల్లి సర్పంచ్ బోసాల దేవుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్‌డిఎస్ కళాశాలలో అవగాహన

ప్రజాశక్తి - గరివిడి

చంద్రయాన్ 3 నింగిలోకి ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేత్తల యంత్రాంగంలో కీలక పాత్ర పోషించిన ఎస్‌డిఎస్ కళాశాల పూర్వ విద్యార్థి కరణం దుర్గాప్రసాద్ బుధవారం తమ కళాశాలలో విద్యార్థులకు చంద్ర మండలంలో చేసిన ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని శ్రీరామ్ విద్యాపీట్ కరస్పాండెంట్ టి. కమలాకర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. చంద్ర మండలంలో చంద్రుడుపై చేసిన ప్రయోగాలు, సాంకేతిక విజ్ఞానాన్ని, భవిష్యత్తులో ఇస్రో చంద్రునిపై చేయబోయే పరిశోధనలపై విద్యార్థులకు ఆయన వివరిస్తారన్నారు. ఈ సదస్సులో గరివిడి, చీపురుపల్లి మండలాల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఆహ్వానం పలుకుతున్నామని చెప్పారు.

కార్యకర్తలంతా అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - విజయనగరం కోట

టిడిపి కార్యకర్తలు, నాయకులంతా అప్రమత్తంగా ఉండాలని విజయనగరం నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. మంగళవారం అశోక్ బంగ్లాలో టిడిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదితి గజపతి రాజు మాట్లాడుతూ ఈ ఎన్నికలలో ముఖ్యంగా ఓటర్ల జాబితాను అందరు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. దొంగ ఓట్లను గుర్తించడం, కొత్త ఓటర్లను చేర్పించడం కోసం ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ అంశాలను ప్రతిరోజూ సమన్వయం చేయడానికి కొంతమంది సీనియర్ నాయకులకు బాధ్యతలు అప్పగించామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, కార్యాలయ కార్యదర్శి రాజేష్‌బాబు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, రాష్ట్ర బిసి నాయకులు వేచలపు శ్రీనివాసరావు, అవనాపు విజయ్, పిల్లా విజయ్ కుమార్, గాడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదితి గజపతి

టిడిపిలోకి చేరికలు

పట్టణంలోని 6,7,45వ డివిజన్లకు చెందిన వైసిపి నాయకులు కంది రాంబాబు, కోట్ల అప్పలనాయుడు, ఆల్తి చిట్టిబాబుతో పాటు సుమారు 80 కుటుంబాలు మంగళవారం టిడిపిలో చేరాయి. అశోక్ బంగ్లాలో ఎమ్మెల్యే అభ్యర్థి అదితి విజయలక్ష్మి గజపతి వీరికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తెలగా కులసంఘ నాయకులు

రిజర్వేషన్‌పై రాజకీయ పార్టీలు స్పందించాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

తెలగా కులస్తులకు బిసి రిజర్వేషన్ పై రాజకీయ పార్టీలు స్పందించాలని ఆ సంఘం నాయకులు కోరారు. స్థానిక ఐటిఐ కాలనీలో మంగళవారం వారు మాట్లాడుతూ తెలగా కులస్తులకు బీసీ రిజర్వేషన్ కల్పించేందుకు కృషి చేస్తామని ఏ నాయకుడు తమకు హామీ ఇస్తే వారికే తమ మద్దతు తెలుపుతామని లేకపోతే తామ కులానికి చెందిన వ్యక్తినే బరిలోకి దింపుతామని హెచ్చరించారు. తమను అందరూ ఓట్లకోసం వాడుకుంటున్నారే తప్పా తమకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడం లేదన్నారు. తమ కులం నుంచి ఆరి గంగయ్య ఒక్కరే బొబ్బిలి పురపాలక చైర్మన్‌గా పనిచేశారని గుర్తు చేశారు. ఆయనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చి ఉంటే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపించేవారని చెప్పారు. ఈ సారి ఎన్నికల్లో తమ కులానికి అవకాశం ఇవ్వాలని లేకపోతే తమ సత్తాను చూపిస్తామని ఆ సంఘ నాయకులు ఆకుల దామోదర్‌రావు, పాతిరెడ్డి హరికృష్ణ తెలిపారు.

యువత ఓట్లే కీలకం కావాలి : ఎమ్‌పి

ప్రజాశక్తి - రామభద్రపురం

రానున్న ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులకు యువత ఓట్లే కీలకం కావాలని ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధిలోని బూసాయవలసలో ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు అధ్యక్షతన మండల యువజన విభాగం అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏక్నాధ్ ఆధ్వర్యంలో మంగళవారం యువజన సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిదన్నారు. రాబోయే ఎన్నికల్లో ఇదే వైసిపి అభ్యర్థుల విజయానికి పునాది అవుతుందన్నారు. కార్యకర్తలు ఐకమత్యంతో మీ ప్రాంత అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ తన గెలుపు నల్లేరుపై నడకేనని అధిక మెజారిటీ వచ్చేందుకు ఇంటింటా ప్రచారాలు ముమ్మరం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతమ్మ, ఎఎంసి చైర్మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్

పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని భోగాపురం కనకదుర్గమ్మ, పోలిపల్లి పైడితల్లమ్మ అమ్మవారి ఆలయాల వద్ద మంగళవారం యాత్రికులు పోటెత్తారు. వేకువ జాము నుంచే యాత్రికులు అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దీనికి ముందు సోమవారం రాత్రి ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. పోలిపల్లి గ్రామంలో పాలధార రథాలను ఊరేగించారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఈ రెండు ఆలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. యాత్రికలకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సిఐ ఎ.రవికుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

నేడు భోగాపురంలో సంగిడి రాళ్ల పోటీలు

భోగాపురంలో అమ్మవారి జాతర సందర్భంగా బుధవారం సాయంత్రం సింగిడి రాళ్ళ పోటీలను నిర్వహించనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వస్తాదులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. గెలుపొందిన వారికి కందుల రఘుబాబు చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నారు.


భోగాపురం గుడి వద్ద సందడి చేస్తున్న యాత్రికులు

బేబినాయన ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపాలిటీలోని ఆరో వార్డులో మంగళవారం టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓటును అభ్యర్థించారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని బేబినాయన అన్నారు. టిడిపి అభిమాని ఇచ్చిన పువ్వుల బాణాన్ని బేబినాయన ఎక్కుపెట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ ఇంచార్జి గిరడ అప్పలస్వామి, టిడిపి పట్టణ అద్యక్షులు రాంబర్కి శరత్, తదితరులు పాల్గొన్నారు.


పూల బాణాన్ని ఎక్కుపెడుతున్న బేబినాయన

సెలవు దినాల్లో ఆస్తిపన్ను వసూళ్లకు కౌంటర్లు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఆస్తిపన్ను వసూళ్లకు సెలవు దినాలలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం పన్ను వసూళ్లలో వెనుకబడిన కంచరవీధి, పూల్‌బాగ్, కుమ్మరివీధి, రావువారివీధి, మల్లమ్మపేట సచివాలయాల సెక్రటరీలు, సచివాలయాల ఇంచార్జిలు, నోడల్ అధికారులతో ఆస్తిపన్ను, కుళాయిపన్ను, ఖాళీ స్థలాల పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పన్నులు వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పన్ను వసూళ్ల వేగం పెంచాలన్నారు. నెలాఖరులోగా పన్ను చెల్లిస్తే వడ్డీ మాఫీ వర్తిస్తుందని, సద్వినియోగం చేసుకునేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. గుడ్ ఫ్రైడే, ఆదివారం సెలవు దినాలలో పన్నులు వసూళ్లకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని, ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ ఆర్ఒ ప్రసాద్, ఆర్ఐ త్రినాథ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ రామలక్ష్మి

ఆకట్టుకున్న గుర్రపు పరుగు పందేలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని చినగుడిపాల శివారు బోజింకివానిపాలెం గ్రామంలో రావాలమ్మ తల్లి తీర్థ మహోత్సవం సందర్భంగా రెండవ రోజు ఏర్పాటు చేసిన గుర్రపు, ఎడ్ల పరుగు పందేలు ఆకట్టుకున్నాయి. డిసిసిబి చైర్మన్ వెంకట చినరామునాయుడు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.12 వేలు, రెండో బహుమతిగా రూ.10వేలు, మూడో బహుమతిగా రూ.8 వేలు, డిసిసిబి చైర్మన్ వి.వి వెంకటచిన్నరామునాయుడు, గ్రామ సర్పంచ్ బోజింకి రామునాయుడు చేతుల మీదుగా అందించారు



గుర్రం, ఎడ్ల పరుగు పందేల్లో పోటీ పడుతున్న యువకులు

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - విజయనగరం కోట

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు అన్నారు. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఎపి పిటిడి ఎంప్లాయిస్ యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. దామోదరరావు మాట్లాడుతూ త్వరలో అందరికి లామినేటెడ్ డిజిటల్ ఇండెంటిటీ కార్డులు, అన్ని కేటగిరుల సిబ్బందికి ఐదు సంవత్సరాలకు ఒక సారి రెన్యూవల్ చేసుకొనే పద్ధతిలో ఇస్తున్నారని తెలిపారు. 2017 పే-స్కేల్స్ అరియర్స్ 2030 వరకు రిటైర్ అయిన వారికి ఇ.యు రాష్ట్ర కమిటి కృషి మేరకు చెల్లింపులు జరిగాయన్నారు. మిగిలి ఉన్నవారిలో 2031 నుండి 2060 వరకు రిటైర్డ్ అయ్యే వారికి ఇప్పుడు 50శాతం ఇస్తున్నారన్నారు. ఇంకో 50శాతం పూర్తిగా ఒకే సారి ఇవ్వాలని కోరామన్నారు. ఇ.యు డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.బానుమూర్తి మాట్లాడు తూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ద్వారా ఏర్పడుతున్న ఇబ్బందులను ఆర్‌టిసి ఎండి దృష్టికి తీసుకెళ్లామన్నారు.


మాట్లాడుతున్న దామోదరరావు

నూతన కమిటీ ఎన్నిక

విజయనగరం ఆర్‌టిసి ఇ.యు జిల్లా నూతన కమిటి ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. జిల్లా అధ్యక్షులుగా కె.కృష్ణారావు (యస్. కోట డిపో), వర్కింగు ప్రెసిడెంటు టి.వి.కె.యస్.నారాయణ, జిల్లా కార్యదర్శి జి.రవికాంత్, కోశాధికారి సి.హెచ్.పి.పట్నాయక్‌తో పాటు మరో ఆరుగురి సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఇ.యు రాష్ట్ర ఉపాధ్యక్షులు పెదమజ్జి సత్యన్నారాయణ, జోనల్ కార్యదర్శి బాసూరి కృష్ణమూర్తి, జోనల్ నాయకులు కె.వి.రమణ, యం.సత్యవతి, బి.జనార్దన, ఉమెన్ కమిటి జిల్లా నాయకురాలు డి.అరుణ, జిల్లా నాయకులు, యస్.కోట, విజయనగరం డిపో అధ్యక్షులు ఏ. శ్రీనివాసరావు, కె.యన్.స్వామి, కొల్లికోటేశ్వరరావు, చవక శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ తెనాలి అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.యస్. 62/2023

బిట్వీన్ :
Krishnamurthy Jewellery Works
Tenali, rep by its Prop. Parimi Venkata Poornananda Krishna Murthy ....వాది
And
Pandu Jewellers, Vijayanagaram, rep by its Prop: N.Venkateswarlu and others...
.... ప్రతివాదులు

To,
D6 : Nagulakonda Vasu, C/o Govind Jewellers, Near S.K.P. Temple, Opp. Neo Malbar Hotel, M.G. road, Vijayanagaram.

పై నెంబరు దావాలో మీకు శ్రీ కోర్టువారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు పంపవలసినదిగా పై కోర్టువారు ఆర్డరు వేస్తూ ది. 22-4-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరపు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు దావాను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

వాయిదా : 22-4-2024

దర్శి శివకోటేశ్వరరావు,
వాది తరపు అడ్వకేట్, తెనాలి.
సెల్ : 94415 31520.